# ప్రేమభేరి

–నిశాపతి

**దాంపత్యాలు సుఖంగా సాగాలంటే భార్యా భర్తల మధ్య అభిరుచులు కలవాలట. స్వభావాలు మాత్రం భిన్నంగా – పరిపూరకంగా – కాంప్లిమెంటరీ టు ఈచ్ అదర్ అంటారే – అలా వుండాలట!**

'రాజు పద్మల దాంపత్యానికి పై సిద్ధాంతం ఎంతవరకూ వర్తిస్తుంది?' అంటే చెప్పడం కష్టం. కావడానికి వాళ్ళిద్దరిదీ ప్రేమ వివాహమే.

పద్మకి కొంచెం కోపం ఎక్కువ. రాజుకి బద్ధకం. అతనికి శారీరకంగానే కాక మానసికంగా కూడా – అంటే ఏదైనా సమస్యని గురించి సీరియస్‌గా ఆలోచించడానికి కూడా (పీకల మీదకి వచ్చిందాకా) – బద్ధకమే! దానికి తోడు,(లేక) దానిమూలాన మతిమరుపు.

అంతపెద్ద కంపెనీకి మూలస్తంభం లాంటి వాడయిన తన భర్త అపార మేధాశక్తి ముందు ఇవి చిన్న – చంద్రుడిలో మచ్చల్లాంటి – లోపాలుగా పద్మ వాటిని 'యిగ్నోర్' చెయ్యాలని రాజు ఆశ. కానీ పద్మ అలా సరిపెట్టుకోదు. దేనికదే! ఆమెకి 'రిజల్ట్సు' కావాలి.

రాజుకి 'రిజల్ట్సు' కన్నా 'నైసిటీస్' ముఖ్యం. చిన్న చిన్న విషయాలు మనసుకి పట్టించుకుని అవేవో భూతాలయినట్లుగా ఊహించుకొని వర్రీ అయిపోతాడు. ఆ వర్రీ అవడంలో అసలు విషయం – గమ్యం – మూలపడిపోతుంది. చివరికి 'రిజల్ట్' వుండదు. పద్మ అది ఎన్నటికీ క్షమించలేని విషయం.

అయితే ఇద్దరిలోనూ ఒకరంటే ఒకరికి వుండే ప్రేమలో కొంచెం కూడా కల్తీ లేనందువల్ల ఆ కాపురం సుఖంగానే సాగుతోంది. నిజానికి పద్మలో వంక పెట్టవలసిన గుణాలేవీ లేవు. కోపం, రిజల్ట్సు కోసం పట్టుదలా తప్ప. ఆ మాటకొస్తే రెండోది అసలు లోపమే కాదు!.



అందరు ఆడవాళ్ళలా ఆమె చీరలూ, నగలూ అడగదు. అఫ్‌కోర్స్, అసలామెకి ఆ అవసరం రాదు (అడగాల్సిన అవసరం). ఇంటి ఖర్చంతా ఆమె చేతిమీదే నడుస్తుంది. ఆమె ఏం కొన్నా ఎందుకు కొన్నావని అతను అడగడు. ఆమె అతణ్ణి అడక్కుండా ఏమీ కొనదు. రాజుకి జీతం నెలకి ఇరవై అయిదు వేలు. కాబట్టి 'డబ్బు యిబ్బంది' ఎప్పుడూ వాళ్ళ మధ్య ప్రధాన విషయం కాదు. అసలు వాళ్ళకి ప్రధానంగా అనిపించే విషయాలు వంటే మనకి నవ్వొస్తుంది.

ఆమె పుట్టింటికి వెళ్తే అతనితో కలిసి కార్లో వెళ్తుంది. మళ్ళీ ఆమె వెనక్కి వచ్చే రోజుకి అతను కారు తీసుకొని వెళ్ళి తీసుకొస్తాడు.

ఆమె పుట్టింటి వాళ్ళు తీసుకు వెళ్ళే బాధ్యతగానీ, తిరిగి తీసుకువచ్చి దింపే బాధ్యత గానీ – ఏదీ తీసుకోరు. అది అతని మనసులో కలుక్కుమంటుంది. అయినా అతను ఏమీ అనడు. అలా అని అసలు వూరుకోడు. ఎప్పుడో మూడ్ బాగా లేనప్పుడు అంటాడు. ఆమె వెంటనే 'రియాక్ట్' అవుతుంది.

"మీకు ఇష్టం లేక పోతే అసలు పంపకండి. అంతే గానీ తీసుకెళ్ళలేదనో, తెచ్చిదింపలేదనో వాళ్ళని ఏమీ అనకండి" అంటుంది.

తన మంచి తనాన్ని గుర్తించలేక పోవడం కంటే తనని పూర్తిగా పరాయివాడిగా చేసి మాట్లాడినందుకు అతను బాధ పడతాడు. ఒక్కో సారి అలాంటి బాధ తగాదాగా రూపాంతరం చెందుతూ ఉంటుంది.

మొదలంటే పెడతాడు గానీ, పాపం, రాజుకి యిలాంటి కలహాలు నిర్వహించడంలో నైపుణ్యం తక్కువ. ఆడవాళ్ళతో మాట్లాడాలీ, లేక పోట్లాడాలీ అంటే దానికో 'స్పెషల్ స్కిల్' కావాలి. రాజు దగ్గర స్పెషల్ కాదుగదా 'ఆర్డినరీ స్కిల్' గూడా లేదు యిలాంటి విషయాల్లో. ఆఫీసులో తోటి మగాళ్ళతో ఎలా మాట్లాడతాడో అలాగే 'లాజిక్' మాట్లాడతాడు. రాత్రి ఏ రెండు గంటలదాకానో నోళ్ళు నొప్పి పుట్టే దాకా వాదించుకుంటారు. వాదించే టప్పుడు రాజుకి తాను మగాడిననీ, సమాజం తనకి ప్రత్యేకించి కొన్ని హక్కులిచ్చిందనీ, అవి 'ఇన్ వోక్' చేసుకుని భార్య నోరు మూయించవచ్చనీ, పాపం తెలీదు. అందుకే ప్రతిసారీ రాజు ఓడి పోతుంటాడు. అలా అని 'పద్మ గెలిచిందా?' అంటే చెప్పలేం. కానీ ఒక దశలో సీరియస్ అయిపోయి, పక్కమీంచి లేచి వెళ్ళి హాలులో చాప పరుచుకుని పడుకుని, రాజులో 'గిల్టీ ఫీలింగ్' కలిగించడం ద్వారా అతనిని ఓడిస్తుంది.

సాధారణంగా భార్యా భర్తలు పగలు గొడవ పడి రాత్రి రాజీపడుతుంటారు. కాని రాజూ పద్మలు రాత్రి గొడవ పడి పగలు రాజీపడుతుంటారు. మిగిలిన కార్యక్రమాలేవైనా వుంటే అవి రాత్రిపూట 'ఇంటర్ వెల్స్'లో జరుగుతుంటాయి.



ఒక్క ముక్కలో చెప్పాలంటే ఆమెకి ఓర్పు లేదు. అతనికి నేర్పు లేదు.

పాపం రాజు మాత్రం రాత్రి జరిగింది తెల్లారే సరికి మర్చిపోతాడు. పద్మ దాన్ని 'మరువు' అరల్లో దాచి, కావలినప్పుడు 'ఫ్రెష్'గా తీసి వాడుతుంది.

ఉదాహరణకి వాళ్ల జీవితంలో ఒక రోజు యిలా సాగుతుంది.–

"పద్మాక్షి"

"ఊ!"

"నిన్ను ముద్దుగా 'పక్షి' అని పిలిస్తే ఎలా వుంటుందోయ్?"

పద్మాక్షి మాట్లాడదు.

"కోపమా?"

"కాదు. బాధ! మీకు కోపం వచ్చి వన్న 'పక్షి' అని తిట్టినా అంత బాద కలగదు. కాని తీరి కూచుని అలా చులకన చేసి పిలవాలని అనిపించిందంటే నా మీద మీ మనసులో ఎక్కడో తేలిక భావం ఉందన్నమాట! అలాంటి భావం కలగడానికి ఆస్కారం యిచ్చినందుకు బాధపడుతున్నాను" అంటుంది.

రాజు చాలా సేపు మాట్లాడడు.

పద్మాక్షి అంటుంది. "కోపమా?"

"కాదు బాధ! నిన్ను అనవసరంగా 'హర్ట్' చేశానని.

"పైకి అలా అంటున్నారు గాని మీకు నిజంగా కోపం వచ్చింది."

"ఎలా చెప్పగలవు?

"మీ దవడ క్కండరం బిగుసుకుంది"

రాజు ఫాం లోకి వచ్చేసి "నీ అంత అందమైన అమ్మాయి పక్కనుండగా వెధవ దవడ కండరమా బిగుసుకుంటుంది?" అంటాడు.

పద్మాక్షి చప్పన తలదించుకుని రెడు చూపుడు వేల్లనీ క్రాస్ చేసి పిల్లలున్న గదివైపు కళ్లతో చూపిస్తుంది. ఆ 'క్రాస్' వాళ్ల సెన్సార్ గుర్తు.

లోలోపల పద్మాక్షికి మొగుడంటే మురిపెమే! అతని మాటలని సంతోషిస్తూనే పైకి విసుక్కుంటుంది. అది నటన అని రాజుతో సహా ఎవ్వరూ గుర్తించలేనంత సహజంగా.

భర్త రసికతకి మురిసి పోతున్న పద్మాక్షికి, హఠాత్తుగా రాత్రి వాళ్ల మధ్య ఘోరమైన పోట్లాట జరిగిన విషయం గుర్తొస్తుంది.

డ్యూయట్ సీన్ 'రిజాల్వ్' చేస్తూ 'ఫైటింగ్' సీన్ సూపర్ ఇంపోజ్ చేసే దర్శకుడిలా మొహం పెట్టి, "రామారావు గారు అద్దె యిచ్చారా? అంటుంది.

రామారావు, రాజు వాళ్ళింట్లో అద్దెకున్న వ్యక్తి. రాజుకి రెండిళ్లున్నాయి ( రెండూ పెద్దవే!) ఒక దాన్లో తనుండి ఇంకోటి అద్దెకిచ్చాడు.

ఆ రామారావు 'ఏ నెలా' ఫస్టున కాదు గదా ఇరవయ్యో తేదీన గూడా అద్దెయివ్వడు. అయితే నెలాఖరులోపల ఎప్పుడో తప్పక యిస్తాడు. ఆ సంగతి రాజుకీ తెలుసు, పద్మకీ తెలుసు.

"ఇవ్వలేదు" అంటాడు రాజు.

రాజు అలా 'డిఫెన్స్'లో పడగానే పద్మ రీ–ప్లే మొదలుపెడుతుంది.

అన్నీ తెలిసిన విషయాలే!

అద్దె పెంచేటప్పుడు రామారావు కొర్కెల్ని రాజు ఎలా మన్నించాడో.(మంచివాడని పించుకోవాలని అంత యావ పనికిరాదు). లోగడ తాము అద్దె యిళ్లలో వుండే రోజుల్లో ఓనర్లు ఎలా వేధించే వాళ్లో (మన మొహాలు ఎక్కడేనా యింతే!) – వగైరా.

పద్మని ఎవరైనా అలా ఎందుకు 'సీన్' చేశావు అని అడగడం జరిగి ఉంటే, "మళ్లీ యింకో సారి యిలా చెయ్యకుండా" అని సమాధానం చెప్పి వుండేది. కాని అది నిజం కాదన్న విషయం ఆవిడకైనా తెలుసో లేదో– అనుమానమే! అంతే గాక, తను అంతగా యిష్టపడే భర్తని యింత చిన్న విషయంకోసం యిన్ని మాటలనడం ఆవిడ తప్పగా భావించదు. దేనికదే!

పద్మలో యింకో సుగుణం కూడా వుంది.

'రామారావు అద్దె యిచ్చేశాడు' అని రాజు అంటే యిక పద్మ రెట్టించదు. నమ్మేస్తుంది. 'అలా చెప్పి తప్పించుకోవచ్చు' అన్న విషయం అతనికి కాస్త ఆలస్యంగా – పద్మ డైలాగ్స్ అన్నీ పూర్తయ్యాక – గుర్తుకొస్తుంది. గుర్తొచ్చాక అంత మంచి 'ఐడియా' వదులుకోవడం ఇష్టం లేక, "చూడు, నేను అబద్ధం చెప్పను. 'నిజానికి రామారావు అద్దె యిచ్చేశాడు' అని నేను అంటే నువ్వేం చేసే దానివి? " అంటాడు.

పద్మ అతని గొప్ప ఐడియాని గడ్డి పరకలా తీసేస్తూ "అంటారంటారు" అంటుంది. అతనికామాటలు, 'అంటే ఏం జరుగుతుందో చూసుకోండి' అన్నట్లు వినిపిస్తాయి.

ఆ మాటలు రాజు హృదయంలో ఒక మూల గుచ్చుకుని వుండిపోతాయి. అలాంటి ముళ్ళు అతని హృదయంలో చాలా వున్నా, చిత్రంగా అతనికి భార్యంటే కొంచెం గూడా అయిష్టం కలగదు.

భార్యంటే తనకి ఎంత ప్రేమో తనకే తెలుస్తుంటుంది.

"ప్రేమ వున్న వాళ్లు యిట్లా క్రమం తప్పకుండా పోట్లాటల 'షేపు' లో మాట్లాడు కుంటారా?" అని ఒక్కోసారి అతనికే ఆశ్చర్యం వేస్తుంటుంది.

బండిని మళ్లీ పట్టాల మీదికి తెద్దామని రాజు 'వీక్' గా ఒక ప్రయత్నం చేస్తాడు.

"నువ్వనవసరంగా 'యింటూ మార్కు'లు పెడుతున్నావు గానీ పిల్లలు ట్యూషను కెళ్లారు గుర్తు లేదా?" అంటాడు.

పద్మ అదేం పట్టించుకోకుండా, "ఇప్పుడు టైం ఎంతో తెలుసా? ఒంటిగంట. యికో గంటలో 'ఫలానా' బ్యాంక్ కట్టేస్తారు. ఆ బ్యాంక్‌లో వున్న మన డిపాజిట్ యివాళ మెచ్యూర్ అవుతుంది. అది 'రె న్యూ' చేద్దాం అనుకున్నాం, గుర్తుందా? అంటుంది.

రాజు 'బ్యాంక్' రూల్స్ వివరించడం ప్రారంభిస్తాడు.

"ఇవాళ కాకుండా యింకో పది రోజులకి వెళ్లి రెన్యూ చేసినా రిట్రాస్పెక్టివ్ ఎఫెక్ట్‌తో యిస్తారు. ఈ విషయం చాలా సార్లు చెప్పానుగా" అంటాడతను, తను కొంచెం ఓడిపోతున్నట్లు గ్రహించి.

"పది రోజులకి కాక పోతే అసలు చెయ్యకండి. నాదేం పోయింది? అన్నీ మర్చిపోతుంటారు గదా అని గుర్తు చేశా. గుర్తు చెయ్యక పోతే మళ్లీ అదీ నాకే!" అంటూ లోపలికి వెళ్లిపోతుంది పద్మ.

ఇంతలో పిల్లలు ట్యూషన్ నుంచి వచ్చి కాలింగ్ బెల్ కొడతారు.

భర్త వైపు ఓ చూపు విసిరి తలుపు తెరుస్తుంది. ఆ చూపుల్లో కాస్తంత చిలిపితనం, కాస్తంత అల్లరీ కలిపివుంటే అవి వాళ్ల ప్రణయ జీవితానికి వారం రోజులకి సరిపడే ఇంధనం అయివుండేది. పద్మకీ మనసులో ఎక్కడో ఓ మూల అలా చెయ్యాలని అనిపించినా ఆమె 'హై–స్టంగ్' ప్రవృత్తి ఆమె చేత అలా చెయ్యనివ్వదు.

ఆ మధ్యాహ్నం గడిచిపోతుంది.

రాత్రి అవుతుంది. ఆమె వంటే చేస్తుంది. అందరూ మెచ్చుకుంటూ తిటారు.

భోంచేశాక వాళ్లిద్దరూ గదిలోకి వెళ్తారు.

పగలు జరిగిన విషయాలు గుర్తు రాగా...

"మనం పిచ్చివాళ్లం. చిన్న చిన్న విషయాలకి పోట్లాడుకుంటాం" అంటాడు రాజు ఆమె చేయి పట్టుకుంటూ. అతని కళ్లల్లో తడి.

"పొండి. మీరే!" అంటూ ఆమె చెయ్యి విదిలించుకుంటుంది.

ఆ విదిలింపు సంధి కావచ్చు!

యుద్ధ ప్రకటనా కావచ్చు!

ఏదవుతుందీ అనేది ఆ యిద్దరు తెలివైన మూర్ఖుల్లో ఎవరికీ ముందుగా తెలీదు!

తెల్లారాక మళ్లీ మరో కొత్త రోజు ప్రారంభం అవుతుంది.